# పోలీసు

2వ పేజీ కొరవ

బదిలీ ఉత్తర్వులు టెలిగ్రాం ద్వారా పంపుతారు. ఇవన్నీ చూసి, చూసి; విని, విని జనంలో పోలీసు అంటే చులకనై పోయింది. పోలీసుల పట్ల ఏ మాత్రం సానుభూతిలేని వాతావరణం ఏర్పడింది.

మంత్రి కోడెల శివప్రసాద్ ఇంట్లో బాంబుల ఫ్యాక్టరీ నడుస్తున్నట్లు స్పష్టంగా బయటపడినా ప్రశ్నించే ధైర్యం ఒక్క ఐపిఎస్ అధికారికీ లేదు. ముఖ్యమంత్రి కోపపడతారని భయం. నెల్లూరు వరకు చూసినా - ఆత్మకూరు ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు పబ్లిక్‌గా బ్యాలెట్ బాక్సులకు నీళ్లు పెట్టినా కేసు పెట్టే ధైర్యం ఎస్పికి, కలెక్టర్‌కు లేదు. సిఎం చీవాట్లు పెడతారని హడలే. చెప్పుకొంటూపోతే ఇటువంటి సంఘటనలో కోకొల్లలు. ఈ రోజు చంద్రబాబు చెప్పులు తమ నెత్తిన పెట్టుకొని నీళ్లు చల్లుకొంటున్న ఈ ఐపిఎస్, ఐఎఎస్ అధికారులే రేపు కాంగ్రెస్ ప్రభుత్వం పెత్తనానికి వస్తే - వైఎస్. రాజశేఖరరెడ్డి పాదాలు తాకి స్వామిభక్తి ప్రదర్శిస్తారు. అధికారంలో ఎవరువుంటే వారికి వీరు బానిసలు. ఇంగ్లండ్ మహారాణి కారును నిల్పిన కానిస్టేబిల్ వీరి దృష్టిలో చేతకాని చవట. మన ఎస్‌పిలు, కలెక్టర్లు ఆ సమయంలో అక్కడ వుండివుంటే ఆ కానిస్టేబిల్‌ను సస్పెండ్ చేసి వుండేవారు - రాజద్రోహం నేరం క్రింద!

పోలీసు వ్యవస్థ జనం దృష్టిలో ఇంత పల్చన కావడానికి ప్రధాన కారకులు - ఐపిఎస్ అధికారులే - వీరు నగరాలలోనే వుండాలి; తమ పిల్లలు పబ్లిక్ స్కూళ్లలో చదవాలి; తమ ఇళ్లలో అంట్లు తోమడానికి, బూట్లు పాలిష్ చేయడానికి ఉచిత నౌకర్లు కావాలి; జీతానికి పదిరెట్లు లంచాలు తినాలి; కోట్ల రూపాయలకు తక్కువ లేని ఇళ్లు కట్టుకోవాలి. వీటన్నింటికీ రాజకీయవాదుల ప్రాపకం కావాలి. తమ స్వార్థం కోసం తమకు తిండి పెట్టే పోలీసు శాఖనే నాశనం చేస్తున్నారు.

కాని నక్సలైట్ల తూటాలకు బలైపోతున్న పోలీసు కానిస్టేబిళ్ల పరిస్థితి అది కాదు. వారికి జీతం మాత్రమే జీవనాధారం. నెలల పర్యంతం వారికి అడవుల్లో డ్యూటీలు వేస్తారు. పెళ్లాం, పిల్లలతో మాట్లాడేందుకు టెలిఫోన్ వసతి కూడా వుండదు. అడవుల్లో తిరగడానికి అవసరమైన పరికరాలేవీ ఇవ్వరు. ఎందుకూ పనికిరాని తుపాకులు చేతిలో పెడతారు. అవసరం వచ్చినప్పుడు అవి పేలవు. సరైన తిండి వుండదు. ఒక్కొక్కసారి త్రాగడానికి నీళ్లు కూడా దొరకవు. జబ్బు చేస్తే వైద్య సహాయం అందదు. మైళ్లకు మైళ్లు నడిచి తిరగాలి. చీకట్లో పాములు, తేళ్ల నుంచి రక్షణ వుండదు. కనీసం బైనాక్యులర్స్ కూడా వుండవు. చాలా కఠినమైన, కఠోరమైన డ్యూటీలు చేయాలి. బ్రతకడానికి వేరే దారిలేక పోలీసుద్యోగం చేయాల్సిందే తప్ప, పగవాడికి వద్దు ఆ శిక్ష అన్పించేట్లు వుంటుంది వారి పరిస్థితి. ఈ మధ్య కొంత నయం కాని, ఇదివరకైతే చస్తే పట్టించుకునే వాడే వుండేవారు కాదు. పెళ్లాం, పిల్లలు అనాథలై పోయేవారు. కాని, ఏ జనం రక్షణ కోసం వీరు ఇన్ని కష్టాలు పడుతున్నారో, ఆ జనానికి వీరి పట్ల కనీస సానుభూతి లేదు. నక్సలైట్లు ఈ పోలీసుకు శత్రువులు కాదు; సర్కారు డ్యూటీలో భాగంగా ఎన్‌కౌంటర్లు చేయడం తప్ప నక్సలైట్లపై పగతో కాల్పులు జరపరు. కాని ఆ త్యాగానికి గుర్తింపు లేదు.

యుద్ధంలో సైనికుల కంటె ముందు సైనికాధికారి శత్రువుతో పోరాడాలి. నాయకత్వం వహించాలి. కాని ఒక్క ఐపిఎస్ అధికారి అడవుల్లో నక్సలైట్ల గాలింపుకు పోలీసుకు నాయకత్వం వహిస్తాడా? సంఘటన జరిగిన తర్వాత ఫుల్ ప్రొటెక్షన్‌తో స్థలం సందర్శిస్తారు - అంతే!

పోలీసు అధికారులలో ఏ మాత్రం మానవత్వం మిగిలివున్నా - తమ శాఖ పట్ల జనానికి ఎందుకు చిన్నచూపో తెలుసుకోవడానికి ఆత్మ విమర్శ చేసుకోవాలి. నగరాలు, పట్టణాలలో జనాన్ని దోచుకతిని, బొజ్జలు పెంచుకునే పోలీసుకు; అడవులలో జనం కోసం ఆత్మ బలిదానం చేస్తున్న పోలీసుకు గల తేడాను వివరించి చెప్పాలి. ప్రజలను చైతన్య పరచి, పోలీసుల త్యాగానికి విలువ కల్గేటట్లు చూడాలి.

# సామాన్యుడు

2వ పేజీ కొరవ

త్యాగం చేసినట్లు ఫోజు కొట్టి క్యాష్ సర్దుకు పోవడం - భలే మంచి బేరం!

టిక్కెట్లు రాని రాజకీయవాదులు ఈ ఎన్నికలలో బాగా లాభపడ్డారు. రాజకీయాలలోకి వ్యాపారులు ప్రవేశించడంతో, వీరు రాజకీయాన్ని లాభసాటి వ్యాపారంగా మార్చి టిట్‌ఫర్ టాట్ చెప్పారు. ఒకరి వ్యాపకంలో ఇంకొకరు వేలు పెడితే ఎవరికైనా కష్టమే కదా?

మొత్తనికి ఎన్నికల పేరు చెప్తే సామాన్యులే కాదు - సాధారణ రాజకీయ వాదులు సైతం భయంతో పారిపోయే స్థితి కల్పించాయి ఈసారి ఎన్నికలు. అసలు కోటి, రెండు కోట్లు ఖర్చు చేసి ఎమ్మెల్యేగా గెల్చి ఏమి సాధిస్తారు వీరు? ఆ పదవిలో అంత మాధుర్యం ఏమి వుంది? కొమ్మి లక్ష్మయ్యనాయుడు, విజయరామిరెడ్డి వంటి వారు తెలివైన ఎమ్మెల్యేలు. ఆ చిన్న పదవితోనే కోట్లు పండించుకోగల్గిన చాణుక్యులు. అందరికీ ఆ విద్య అబ్బదు కదా? వ్యాపారాలలో కుబేరులైన వారికి ఎమ్మెల్యే పదవి అడ్డం పెట్టుకొని చిల్లర ఏరుకొనే తీరిక వుండదు. ఆ సమయం తమ వ్యాపారాల మీద వెచ్చిస్తే అంతకు పదిరెట్లు ఆర్జించగలరు వారు. ఆర్థికంగా ఒక స్థితి వచ్చిన తర్వాత, సమాజంలో ఒక స్థాయి కావాలని కోరుకోవడమే వ్యాపారుల రాజకీయ రంగ ప్రవేశానికి కారణం. అందుకోసం వారు డబ్బు విచ్చలవిడిగా వెదజల్లుతున్నారు. దానితో రాజకీయ రంగం సామాన్యులకు దూరమై పోతున్నది. ఈ రోజు ఎమ్మెల్యే పదవికి కోట్ల ఖర్చు అలవాటు చేస్తే - రేపు మండలాధ్యక్ష పదవికి అరకోటి అయినా వెచ్చించవలసి వస్తుంది; ఆ తర్వాత సర్పంచ్ గిరీ లక్షలు పోసి కొనవలసి వస్తుంది. జన సాన్నిహిత్యం, జనానికి పనిపాట చేసి పెట్టడం అనేవి రాజకీయానికి అర్హతలుగా పరిగణించలేని పరిస్థితి ఏర్పడుతున్నది. దీర్ఘ కాలంలో సమాజానికి అనర్థం తెచ్చే పరిణామం ఇది. *



విజయమహల్ గేటు వద్ద బొక్కలైవు బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు నిర్మాణపు పనిని పరిశీలిస్తున్న మునిసిపల్ ఛైర్మన్ వివేకానందరెడ్డి, కమీషనర్ వేమారెడ్డి, ఇతర అధికారులు.



## కాంగ్రెస్

మొదటిపేజీ కొరవ

హైదరాబాదు నగరంలోనే ఈ పరిస్థితి ఏర్పడి వున్నారు. జిల్లాలలో మాత్రం అదే వాతావరణం కన్పడదనే గ్యారంటీ లేదని తెలుగుదేశం భయం; కాంగ్రెస్ ఆనందం. అందువల్లే 11తేది పోలింగ్ ముగియగానే చంద్రబాబు కొరవ చూపి, బిజెపి నేతలను పిలిపించి, బూత్‌ల స్థాయిలో తెలుగుదేశం, బిజెపి పార్టీల కార్యకర్తలతో సంయుక్త కమిటీలు వేసి, ప్రచారం నిర్వహిస్తామని ప్రతిపాదించారు. ప్రమాదం జరిగిపోతున్నదన్న భయం కలుగుంటే రెండు పార్టీలకూ కల్పి ఒకే కమిటీ వేసేంత సాహసం చేయరు కదా అని ప్రశ్నిస్తున్నారు కాంగ్రెస్‌నేతలు.

పిసిసి అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి రైతులకు ఉచిత విద్యుత్ పథకం ప్రకటించడమే తమ పాలిట అదృష్టంగా పరిణమించిందన్నది వీరి అభిప్రాయం. మహిళలలో, మధ్య తరగతి వర్గాలలో తెలుగుదేశం పట్ల సానుభూతి కన్పించినప్పటికీ ఉచిత విద్యుత్ హామీతో సన్నకారు గెలవలేకామను కొంటున్న ఎమ్మెల్యేలు. మొన్నటి వరకు టిక్కెట్ల కోసం వచ్చేవారితో పూచిక పుల్లకేదు రాజశేఖరరెడ్డి. ఇక నుంచి మంత్రి పదవుల పైరవీతో సతమతం కాబోతారు.

ఎన్నికల నిర్వహణలో పిసిసి అధ్యక్షుడిగా రాజశేఖరరెడ్డి తమకందించిన సహకారం పట్ల కాంగ్రెస్ అభ్యర్థులందరిలోనూ సంతృప్తి వ్యక్తమౌతున్నది. చంద్రబాబు ప్రచార శైలికి ధీటుగా కాంగ్రెస్‌ను నడిపించారని అభినందనలు విన్పిస్తున్నాయి. నిజానికి చంద్రబాబుకు, రాజశేఖరరెడ్డికి పోలికే లేదు. ఆయన ముఖ్యమంత్రి. ఎన్నికల కోసం వందకోట్ల రూపాయలకుపైగా సిద్ధం చేసుకొని వుండిన అధికార పార్టీ నేత. రాజశేఖరరెడ్డి పరిస్థితి అది కాదు. అధికారంలో లేక పోవడంతో పాటు, తిరిగి అధికారంలోకి రాగలరన్న వాతావరణం కూడా లేని స్థితిలో పార్టీని నడిపించ వలసి వచ్చింది. దానితో పారిశ్రామికవేత్తలు, వ్యాపారుల నుంచి



నెల్లూరు చిన్నబజారులో చవితి వుత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి పూజలుచేస్తున్న శుకాశ్రమస్వామి మార్కండేయానందగిరి, ప్రక్కన ఆర్‌ఎస్‌ఎస్ నేత దువ్వూరు శేషయ్య

రైతాంగం సమస్తం కాంగ్రెస్‌వైపు ఆశగా చూసిందని, దానితో గ్రామాలలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయిందని వీరి వ్యాఖ్యానం.

రాజశేఖరరెడ్డి తన చివరి దశ పర్యటన ముగించుకొని తిరిగి రాగానే ఆయనపై వాలిపోవడానికి సిద్ధంగా వున్నారు నిధులు, సహకారం అందలేదు. ఒక ప్రక్క చంద్రబాబు పత్రికలు, టివిలలో ప్రకటనలతో హోరెత్తిస్తున్నాడు. ఆయనతో పోటీ పడాలంటే చిన్న పని కాదు. అయినా రాజశేఖరరెడ్డి బింకంగానే వ్యవహరించాడు. గట్టి పోటీ ఇవ్వగలిగాడు. రాష్ట్రమంతటా ఎన్నికల ప్రచారం చేసిన ఏకైక కాంగ్రెస్ నాయకుడు కూడా రాజశేఖరరెడ్డి మాత్రమే! తన స్వంత నియోజకవర్గం పులివెందులలో తను స్వయంగా ప్రచారం చేయనవసరం లేకపోవడం; కడప జిల్లాను పర్యవేక్షించడానికి డాక్టర్ పిఎల్ రవీంద్రరెడ్డి, మైసూరారెడ్డి వుండడం రాజశేఖరరెడ్డికి అనుకూలించింది. దానితో చంద్రబాబుతో సమంగా అన్ని జిల్లాలూ తిరిగాడు. అప్పటికి హెలికాప్టర్ లేకపోవడం పెద్ద లోపమైంది పాపం! కారులోనే నిద్రపోవలసి వచ్చింది. ఒక్కొక్క రోజు స్నానం చేయడానికి కూడా సమయం చిక్కక రైలులో స్నానం చేశాడు. కారులో వెళ్తూ భోజనం చేశాడు. ఆయన కష్టం ఫలించిందని, కాంగ్రెస్‌వాదులు సంతోషపడుతున్నారు. *



జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డును రాష్ట్రపతి కె.ఆర్. నారాయణ్ చేతుల మీదుగా అందుకొంటున్న జిల్లాకు చెందిన కుమారి గుడ్లూరి రాజేశ్వరి. ప్రక్కన కేంద్ర మానవవనరుల శాఖామంత్రి డాక్టర్ ఎం.ఎం. జోషి.

## ఎవరికి ఎన్ని

మొదటి పేజీ కొరవ

ఎమ్పీ స్థానాలకు సంబంధించి రెండు పార్టీల వారూ మొత్తం మూడు స్థానాలూ తమవేనన్నట్లు భావిస్తున్నారు. నెల్లూరులో కొద్ది తేడాతోనైనా తమ అభ్యర్థి గెలుస్తుందని; ఒంగోలు, తిరుపతి స్థానాలలో అధిక మెజారిటీలు వస్తాయని తెలుగుదేశం నేతలు భావిస్తుంటే; నెల్లూరులో గతంలో కంటే అధిక మెజారిటీతో తాము గెలుస్తామని కాంగ్రెస్ నేతల అభిప్రాయం.

ఈ గెలుపు అంచనాలకు ఆధారంగా రెండు పార్టీల వారూ రకరకాల లెక్కలు విన్పిస్తున్నారు. మహిళలు మొత్తంగా తమకే ఓటు వేశారని; ముస్లింలలో 50శాతం పైగా తమను ఆదరించారని తెలుగుదేశం వాదుల వాదన. కాంగ్రెస్ పార్టీ దీనితో ఏకీభవించడం లేదు. కాంగ్రెస్ అనుకూల ప్రభంజనం ఏర్పడినప్పుడు ఆడా, మగా కూడా ఒకే రకంగా ఓటు వేస్తారని; తతిమా కోస్తా జిల్లాలన్నింటిలో కాంగ్రెస్ అంత బాగా పుంజుకున్నప్పుడు నెల్లూరు మాత్రం ఎందుకు వెనుకపడుతుందని వీరి వాదన.

మొత్తం మీద నెల్లూరు జిల్లాకు సంబంధించి రెండు పార్టీల వారూ మంచి ఆశతో వున్నారు. ఎవరికి నచ్చిన లెక్కలు వారు వేసుకొంటున్నారు. తాము ఎవరికి ఓటు వేసింది ఎవరికీ అర్థం కాకుండా వ్యవహరించడంలో మన ఓటర్లు ఎంత తెలివిమీరి పోయారో తెలుసుకోవడానికి ఈ అంచనాలే నిదర్శనం. *

## భయమా?

మొదటి పేజీ కొరవ

మంత్రులు, తెలుగుదేశం ఎమ్మెల్యేలు స్వేచ్ఛగా గ్రామాలకు వెళ్లి, పోలీసుల సహకారంతో రిగ్గింగ్ జరిపించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఏ తెలుగుదేశం అభ్యర్థి కూడా గ్రామాలకు వెళ్లడానికి సాహసించలేకున్నారు. పోలీసులలోనూ ప్రభుత్వం పట్ల సానుభూతి లేదు. ఉచిత విద్యుత్ హామీతో రైతులలో కాంగ్రెస్ పట్ల మక్కువ కన్పిస్తున్నది. అదే చంద్రబాబుకు ఆందోళన కలిగించే విషయం. తెలంగాణాలో పార్టీ తుడిచి పెట్టుకపోతె, ఆంధ్రా ఏరియాలో సగం సీట్లు వచ్చినా అధికారం తన చేతికి చిక్కదు. పదవి చేజారి పోతుందనే దిగులు ఆయన ముఖంలో వ్యక్తమౌతున్నది. *

కాంగ్రెస్ పట్ల మక్కువ కన్పిస్తున్నది. అదే

## ఆంధ్రాబ్యాంకు :: దుత్తలూరు శాఖ

### ఆటోల వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడమేమనగా ఆంధ్రాబ్యాంకు, దుత్తలూరు బ్రాంచి వారు రెండు ఆటోలు ఎలా వున్నవి అలాగే **24.9.99 తేది శుక్రవారం ఉదయం 11.00 గంటలకు** వేలం వేయబడును. ధరావత్తు రూ.1,000లు చెల్లించి పాటలో పాల్గొనవలెను. పాటపాడినవారు కొరవ మొత్తమును వెంటనే చెల్లించ వలెను. మిగతా వివరములకు బ్యాంకు పనిచేయు వేళల యందు తెలుసుకొనవచ్చును.

... బ్రాంచి మేనేజరు



## శుభాకాంక్షలు

మా మిత్రుడు, యరబోలు ప్రభాకరరెడ్డి, మోపూరు గారి కుమారుడు, ఇంజనీరింగ్‌లో గోల్డ్ మెడలిస్ట్, ఫ్లోరిడా (అమెరికా)లో వుంటున్న **వై. సుజనేంద్రరెడ్డి, సుప్రియ**ల వివాహం 12.9.99 తేది నెల్లూరులో జరిగిన శుభసందర్భంలో మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

**24.9.99 తేది బయలుదేరి తిరిగి ఫ్లోరిడా వెళ్తున్న సందర్భంలో వారి విదేశీ ప్రయాణం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాము.**

... మిత్రులు

Edited, Printed and Published by N. Dolendra Prasad at Zaminryot Press, Ph: 327354. Offset Printing at Zamin Ryot Press, Nellore